# తృప్తి

రైల్లో ప్రయాణంచేస్తూకూడా టెలిగ్రాం చూసుకున్న షాక్ నుంచి తేరుకోలేదు విశాల.

మధ్యాన్నం నాన్నకి జవాబురాస్తూ కూర్చుంది. "నాన్నా! నీ వుత్తరం అందింది. ఇంట్లో పనులమూలంగా వెంటనే జవాబు రాయలేకపోయాను మీరు వెళ్ళినరాత్రి నా నాటకం రేడియోలో వచ్చింది. మీరూ, అమ్మా వాళ్ళంతా విన్నామని రాశారు."

తలుపు చప్పుడైతే కలంకింద పెట్టి లేచివెళ్ళి తలుపు తీసింది. టెలిగ్రామ్స్ అందుకోవటం సామాన్యమే కాబట్టి అంత సామాన్యంగానూ అందుకుని విప్పింది — చదివింది. రెండోసారి చదివింది ... నాలుగోసారి చదివింది. క్రమక్రమంగా చదవటానికి అక్షరాలు కనిపించకుండా పోయాయి. కళ్లు చీకట్లు కమ్మాయి. గుండెలు బరువెక్కిపోయాయి. టెలిగ్రాం గుప్పెట్లో ఇరుక్కుంది.

మోకాళ్ళ మధ్య తల పెట్టుకుని కూర్చుండిపోయింది విశాల. శేఖరం యింట్లోకివచ్చి స్థాణువులా కూర్చున్న విశాల చేతుల్లోని కాయితం చూసి నిశ్చేష్టుడయి విశాలకేసి చూడలేక పోయాడు. ఇద్దరిమధ్యా ఎలాంటి సంభాషణా జరగలేదు.

రైల్లో కూర్చున్న తర్వాత ఎంతోసేపటికిగానీ తను ప్రయాణం చేస్తోన్న సంగతి తెలీలేదు విశాలకు. అప్రయత్నంగా శేఖరంకేసి చూసింది.

"బాధగా వుందా విశాలా ?" అనునయంగా అన్నాడు శేఖరం.

" ... ... ... "

"నేను మతిపోయి అడుగుతున్నాను. కన్నతండ్రి పోయాడన్న కబురు తెలిస్తే బాధగా వుండదూ?"

తీక్షణంగా చూసింది విశాల — "మా నాన్న చచ్చిపోలేదు. నా కెవ్వరి సానుభూతీ అక్కర్లేదు" అన్నట్టు.

నిజంగా ఆ వార్త విశాలకి నమ్మశక్యంగా లేదు. ఇంత అకస్మాత్తుగా నాన్నపోవటం ఏమిటి? వారంరోజుల క్రిందట వచ్చితనని చూసివెళ్ళిన నాన్న ... వెళ్ళీ వెళ్ళగానే క్షేమ సమాచారాలతో వుత్తరం రాసిన నాన్న ... చచ్చిపోవటం ఏమిటి? ఈ ప్రపంచంలో నాన్న లేకుండా పోవటం ఎలా సంభవం?

గంటల తరబడీ ఆలోచిస్తోంది. ఆ అపనమ్మకాన్ని గురించే.

"మనస్సు సరిపెట్టుకో విశాలా! రేపోమాపో మనమూ అంతే." తృళ్ళిపడింది విశాల. వెర్రిగా చూసింది మొహంలోకి.

"రేపో మాపో మనమూ అంతే."

అవునా? అంతేనా? ఓ రోజుకి తను చచ్చిపోతుంది. తన భర్త చచ్చిపోతాడు. ఇంకోరోజుకి...

కిటికీలోంచి దూరంగా కారు చీకట్లోకి చూస్తూ కూర్చుంది – ఎంతోసేపు. ఉలిక్కిపడ్డదానిలా తల తిప్పి మళ్ళాచూసింది శేఖరంకేసి. విశాల కళ్ళనిండా నీళ్లు ఉన్నాయి నోరు పెగుల్చుకుంటూ అంది—"మా అమ్మ..."

"ఏమిటి?"

"మా అమ్మ..."

"అవును. పాపం! ఆవిడెంతో ఏడుస్తూ వుంటుంది."

"అదికాదు. మా అమ్మని యింకా ఏడిపిస్తారు."

శేఖరానికేం అర్థం కాలేదు. విశాల అంతకన్న ఎక్కువేం చెప్పలేదు. మాట్లాడకుండా కిటికీ చెక్కలమీద మొహం ఆన్చుకుని కూర్చుంది.

* * *

ఆ పాపిష్టి ఘడియలు రానే వచ్చాయి, నాన్న శాశ్వతంగా పోయారన్న దుఃఖం ఓ ఎత్తూ – అమ్మకి అన్యాయం జరుగుతోందన్న బాధ ఓ ఎత్తూ, అయ్యాయి విశాలకు.

తెల్లవారుఝాము మూడు గంటలై వుంటుంది. ఇల్లంతా ఓ రకమైన సందడీ — మరో రకమైన వుదాసీనం ఆవరించివున్నాయి. ఎక్కడో మారుమూల గదిలో – చిమ్మ చీకట్లో—కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ కూర్చునివుంది అమ్మ.

అమ్మని గురించీ–అమ్మకు పట్టబోయే దౌర్భాగ్యాన్ని గురించీ ప్రతీ క్షణం ఆలోచిస్తూనే వుంది విశాల. మరో గంట

కథా నిలయం
238
(శ్రీకాకుళం)

లోనో...ఘడియల్లోనో...అమ్మ ... విధవ అవుతుంది — విధవ!...విధవ!

విశాల శరీరం కంపించింది_మనస్సు ఆక్రోశించింది.

“అమ్మ విధవ అవుతుంది. నాన్నతోపాటు అమ్మ సర్వం కోల్పోయింది.”

“కాని ... అది ధర్మంకాదు. అమ్మని విధవని చేసే శక్తి ఎవ్వరికీ లేదు. ఓ ఆడదాన్ని...అన్యాయంచేసే హక్కు ఎవ్వరికీ లేదు_అది మహా దారుణం. దానికి తను అడ్డు పడకపోతే ఈ ఆవేదనకి అర్థంలేదు.”

తలుపులు తోసుకుని అక్కయ్య వచ్చింది లోపలికి.

“విశాలా! ఇంకా నిద్రే.”

“లేదక్కయ్యా! నా కసలు నిద్రే పట్టలేదు.”

“ఏం నిద్రో వల్లకాడు. బోలెడు తతంగం వుంది. ఇదిగో ఈ పసుపుగుడ్డ తీసుకో. తొందరగా లేచిరా.”

“పసుపు గుడ్డేవిటి? ఎందుకదీ?

“నీ మంగళ సూత్రాలు కనిపించకుండా జాగ్రత్తగా కట్టుకో. అమ్మని చూడ్డానికిరా తొందరగా. ఇలా కూర్చుంటే కాదు. అవతల చాకలివాళ్ళొచ్చి నించున్నారు. ఏవీ సూత్రాలు నేనే కడతాను.”

“ఉండు. నే కట్టుకుంటాలే. అవి కట్టుకోటం ఎందుకో చెప్పు ముందు.”

ఆశ్చర్యంగా చూసింది వరలక్ష్మి – "ఎందుకేవిటే? అలా కట్టుకోకుండా అమ్మని...చూడకూడదు."

"చూస్తే...?"

"అమ్మో! కీడు తగలదూ? ఎవరి పసుపు కుంకాలంటే ఎవరికిష్టం కాదూ?"

"చూడక్కయ్యా! అమ్మ తన పసుపు కుంకాల గురించి ఎన్నడైనా అజాగ్రత్త చేసిందా? ఇలాంటి కీడుపనులు చేసిందా? మరి ఈ దౌర్భాగ్యం ఎందుకు వచ్చింది?"

"బావుందే! అంతా మన చేతుల్లో వుంటుందా? ఎవరి ఖర్మ వాళ్ళది."

"అందుకే ఈ తతంగాలన్నీ నా కిష్టం లేదు."

విస్మయంగా చూస్తూ అంది వరలక్ష్మి – "కొంపదీసి పసుపుగుడ్డ కట్టుకోకుండా వస్తావా ఏమిటి?...నీ వుద్దేశ్యాలు ఎప్పుడెలా వున్నా ... యిలాంటి విషయంలో..."

"లక్ష్మీ!" అంటూ వచ్చింది వరలక్ష్మి అత్త వెంకాయమ్మ.

"ఏవిట్రా పెళ్ళింట్లో ముచ్చట్లాడు కొంటున్నట్టు కబుర్లూ మీరూనూ. ఎవడైనా చూస్తే నవ్వుతాడు. తొందరగా బైటికిరండి."

వరలక్ష్మి గబగబా గదిలోంచి వెళ్ళిపోయింది. విశాల కూర్చున్న చోటునుంచి లేవలేదు.

"అమ్మాయ్! లేచి వెళ్ళు. మీ అమ్మ అందచందాలు కళ్ళారా చూసుకోండి. అట్టే పొద్దులేదు. చీకటి వుండగానే చెరువునుంచి తిరిగి రావాలి."

ఆవిడ మాటలు వింటున్న కొద్దీ విశాల హృదయం అసహ్యంతో ముడుచుకు పోయింది. "అలా చెయ్యకపోతేనేం అత్తయ్యా?"

"చెయ్యక పోవడం ఏమిటి?"

"అదే – అమ్మని చెరువు దగ్గరికి తీసికెళ్ళి ... ఎందు కదంతాను?"

"ఇది మరీ బావుంది. ఇవ్వాళ మీ అమ్మ నొసటే పొద్దు పొడిచిందా ఏమిటి? పట్టుమని పది నెలలు కాలేదు. నా ఖర్మ కాలి పోలేదూ?"

"అందుకే అత్తయ్యా! ఆ బాధ మీకు తెలియాలి. ఇలా ఒక ఆడదాన్ని పదిమందీ కలిసి అవమానం చేయటం ధర్మం కాదు."

"ఎవళ్ళు చేసే దేముందమ్మాయ్! భగవంతుడే చేశాడు."

"భగవంతు డేం చెయ్యలేదు. అన్నీ మనమే చేసు కుంటున్నాం." ఆవేశంగా అంది విశాల.

"నాకు తెలీ కడుగుతానూ, మొగుడు పోయిన ఆడ దానికి ఇంకా రంగులూ – హంగులూ ఎందుకూ? గాజూ పూసా తీసేసుకోటం మన ఆచారం కాదూ?"

విశాల ఒక్క నిముషం ఆవిడ మొహంకేసి చూసింది– "పూర్వ కాలంలో మనకు ఎన్ని ఆచారాలుండేవో మీకు తెలుసా? మొగుడు చచ్చిపోతే ఆ చితిమీదే ఆడదాన్ని కూడా కాల్చి చంపేసేవారు. ఆ రోజుల్లో మీలాంటి వాళ్ళంతా మొగుడు చచ్చిన ఆడది యింకా బ్రతకటం ఎందుకూ? బ్రతికి ఏం బావుకుంటుందీ? అని ఎన్నో ఆటం కాలు పెట్టే వుంటారు – మీరన్నట్టు ఓ నాడు ఆ ఆచారం కూడా వుత్తమంగానే వుండేది – చూడండి అత్తయ్యా! ఈ ఆచారాలూ ఈ పద్ధతులూ కాలాన్నిబట్టి మారుతుంటాయి. భర్త పోయిన ఆడదాన్ని విధవని చేసే ఆచారంకూడా కొంత కాలానికి ఒక ఘోరమైన ఆచారంగా మారిపోవచ్చు. అప్పు డేమంటారు?"

వెంకాయమ్మ కేమీ అర్థం కాలేదు. "ఏమిటో అమ్మాయ్! నువ్వు చదువుకున్న దానివి. నీతో మాట్లాడ్డం నా కెలా తెలిసిచస్తుంది? పోనీ ఆఖరిసారి పసుపు కుంకాలతో మీ అమ్మ మొహం చూసుకుంటావేమోనని పిల్వటాని కొచ్చాను—నీ యిష్టం మరి." అంటూ వెళ్ళిపోయింది.

విశాలకి — చేతకాని వాళ్ళకి వచ్చినంత ఏడుపు వచ్చింది.

వీళ్ళందర్నీ మాటల్లో ఓడించి పంపటం తన వుద్దేశ్యం కాదు. తన వుద్దేశ్యాలు అర్థంచేసుకుని అవునని – అమ్మని ఎప్పట్లా వుండనిస్తే?' అదే తన బాధంతాను.

"విశాలా! ఏమిటే నీ తలతిక్క? లేచిరావేం?" అంటూ వచ్చింది మేనత్త సుందరమ్మ—"నీ పిచ్చిగానీ యివ్వాళ

నువ్వూ నేనూ కాదనుకుంటే సరిపోతుందా? పదిమందీ నవ్వరూ?" అంది మందలింపుగా.

విశాలకు చిరాకువేసింది—"నవ్వేవా ళ్ళెప్పుడూ నవ్వుతూనేవుంటారు. పదిమందీ అంటే ఎవరో ఎక్కడో వుండరు. ఈ ఘడియలో ఈ యింట్లోనే ఓ యాభైమంది పేరంటాళ్ళు వున్నారు. వీళ్ళంతా ఆపాలంటే ఈ దురాచారం ఆగుతుంది. ఏది చేయాలన్నా మనుష్యులే చేస్తారు. ఏ పరివర్తన వచ్చినా మనుషుల్లోనే వస్తుంది—అత్తయ్యా! నువ్వు ఆలోచించు—రేపు ఇలాంటి కష్టం నాకూ రావచ్చు. నీకూ రావచ్చు. అప్పుడు మనం ఎంత కుళ్ళి కృశించిపోతామో..."

"చాల్లే నీ మాటలూ నువ్వూను. కన్నతండ్రిమీద ఏ మాత్రం అభిమానం వున్నా యిలాంటి మాటలు నీ నోటంట వస్తాయా?"

"అత్తయ్యా!" ఆశ్చర్యంగా అంది విశాల—"అమ్మని విధవ చేయటం నాన్నమీద ప్రేమ చూపించటమా?"

"కాకపోతే ఏమిటి? నాన్న పోయాకకూడా మీ అమ్మ షోకులు చేసుకు తిరగాలంటే .... నీకు మాత్రం ఎబ్బెట్టుగా లేదూ?"

"అమ్మో! అత్తయ్యా! నా వుద్దేశ్యం నీకు అర్థమే కాలేదు. అమ్మని పదిమందిమధ్యా కూర్చోబెట్టి చిత్రహింస చెయ్యొద్దంటున్నాను అంతే. ఇక ఎవరెంత నచ్చజెప్పినా ఆవిడ షోకుచేసుకోదు. క్రమంగా ఆ గాజులు వాటికవే రాలి

పోతాయి. మెళ్ళోపూసలు వాటికవే తెగిపోతాయి. వాటన్నిటినీ తిరిగి ధరించటానికీ—మానటానికీ ఆవిడ యిష్టం ఆవిడకి వుంటుంది. ఒక మనిషికి యింత మాత్రపు సానుభూతి చూపించలేమా అత్తయ్యా!"

సుందరమ్మ కూడా మారు మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

విశాల నిశ్శబ్దంగా కూర్చుంది.

చావిట్లో సందడి ఎక్కువైంది. పేరంటాళ్ళంతా అక్కడ చేరారు.

అమ్మని మారుమూల గదిలోంచి చావిట్లోకి తీసుకొచ్చారు. ఆవిడ సన్నగా ఏడుస్తోంది – "భగవంతుడా! ఈ అవమానం నేను భరించలేను తండ్రీ! నన్ను పదిమందిమధ్యా నవ్వులపాలు చేశావు. నా బ్రతుకు బండలు చేశావు. నన్ను నా దేవుడుతోపాటే తీసుకుపో తండ్రీ!"

అమ్మ శోకం వింటూ విశాల ఎంతోసేపు కూర్చోలేకపోయింది. నెమ్మదిగా లేచి కిటికీదగ్గరికి వెళ్ళినుంచుంది. నోటికి పైటకొంగు అడ్డుపెట్టుకుంది—అమ్మని ఆఖరిసారిగా ముస్తాబు చేశారు. ఎర్రటి చీర – పచ్చటి రవికె – పాదాలనిండా పసుపు – నుదుట కుంకుమ బొట్టు—ముడినిండా పువ్వులు—చేతులకి గాజులు—పైటకొంగులో ఒడికట్టు బియ్యం—పండుముత్తైదువలా వున్న అమ్మ మొహం అవమాన భారంతో కళావిహీనంగా వుంది. తలెత్తి ఎవ్వరికేసి చూడలేక భూమిలోకి దించుకు కూర్చుంది.

అమ్మ....కొన్ని సంవత్సరాల క్రిందట...పెళ్ళికూతురై అలాగే తలదించుకుని కూర్చుని వుంటుంది. ఇన్ని సంవత్స రాలూ అమ్మ ఒక పుణ్యస్త్రీగా జీవించింది.

"ఇంకా ఆలస్యం ఏవిట్రా?" అంటూ రంకె వేసింది సుందరమ్మ.

"ఓసే ఎంకీ! లేవదీసికెళ్ళు" అంటూ వంతపాడింది వెంకాయమ్మ.

ఓ రోజు తననీ యిలా విధవని చేశారన్న సానుభూతి లేదు వెంకాయమ్మకి—ఓరోజు తననీ యిలా విధవని చేస్తా రేమో నన్న అనుమానం లేదు సుందరమ్మకి.

ఎంకి అమ్మచెయ్యి పట్టుకొంది.

అమ్మ జీవచ్ఛవంలా నడిచి వెళ్ళింది.

మంచంమీద పడి వెక్కి వెక్కి ఏడ్చింది విశాల.

ఆ సవారీతో అమ్మని అలా స్మశానానికి తీసికెళ్ళినా తను ఇంత బాధపడదు. అది భగవంతుడు చేశాడనుకుంటుంది.

కాని...ఇది భగవంతుడు చేసేది కాదు. తోటి మను ష్యులు చేసేది. హృదయంలేని కిరాతకులు చేసేది. ఆలోచించ లేని మూర్ఖులు చేసేది.

అమ్మని తిన్నగా చెరువుదగ్గరికి తీసికెళ్తారు.

రెండు చేతులకు వున్న గాజులు బద్దలుగొడతారు.

మెళ్ళో వేళ్ళాడుతోన్న మాంగల్యం తెంచుతారు.

నుదుట వెలుగుతోన్న కుంకుమ చెరుపుతారు.

తలలో పువ్వులు వూడలాగి పారేస్తారు.

కట్టుకున్న రంగుచీర విప్పదీస్తారు.

"నీ భర్తతోటే నీ అంద చందాలు పోయాయి. నీ కడుపు కో పట్టెడు తిండీ, శరీరానికో మూరెడు గుడ్డా చాలు. నీ ఖర్మ యిలా కాలిందనుకో" అంటూ చెర్లో నీళ్ళు తెచ్చి నెత్తిమీద గుమ్మరిస్తారు.

అమ్మ పుణ్య స్త్రీత్వం గంగ పాలై పోతుంది. అమ్మ విధవ అవుతుంది...విధవ...అవుతుంది.

భయం... భయంగా... ముడుచుకు కూర్చుంది విశాల. మనస్సు మూగపోయింది. ఆలోచనలు స్తంభించాయి.

హడావుడిగా లోపలికి వచ్చింది వరలక్ష్మి— "విశాలా! తెల్లవారిపోతుందే! మొహంకడుక్కుని స్నానం చేసివచ్చి కూర్చో. తొందరగా లేచిరా!" అంటూ అంత హడావుడి గానూ వెళ్ళిపోయింది.

నీరసంగా లేచి బయటకి వెళ్ళింది విశాల. ఇల్లూ పెరడూ నానా గందరగోళంగా వున్నాయి. వాకిట్లో గాడి పొయ్యిలు భగ భగా మండు తున్నాయి. అన్నాలూ— కూరలూ—కాఫీలూ—టిఫెన్లూ చకచకా తయారౌతున్నాయి. ఎవళ్ళకి వాళ్ళే హడావుడి పడిపోతున్నారు. పిల్లలంతా ఉప్మా తినటానికి దెబ్బలాడుకొంటున్నారు.

విశాల ఒక్కతే నిమ్మకి నీరెత్తినట్టు ఓ స్తంభాన్ని ఆనుకుని నుంచుంది...ఎంతోసేపు.

తెప్పరిల్లినదానిలా గబగబా మొహం కడుక్కోటానికి వెళ్ళింది. స్నానం చేసి తల దువ్వుకొంది. కాఫీ తాగుతూ, తాగుతూ ఏదో గుర్తువచ్చినదానిలా వరలక్ష్మి కోసం వెదికింది.

"అక్కయ్యా! అమ్మ కాఫీ తాగిందా?"

"నెమ్మదిగా మాట్లాడు బాబూ! అత్తయ్య వింటే తిడుతుంది."

"అమ్మ కాఫీ తాగిందా అంటే అత్తయ్య తిట్టడం ఏమిటి?"

వరలక్ష్మి అరిటాకుల్లో వుప్మాసర్ది పెడుతూ అంది– "అమ్మ ఏమీ తినకూడదట. బ్రాహ్మలకి పాత్రదానం యిచ్చి మళ్ళా స్నానం చేయించేవరకూ..."

"ఛీ! నీకన్నా బుద్ధిలేదూ? ఆ వెధవ తతంగాలన్నీ ముగిసేసరికి దాని ప్రాణాలుకాస్తా పోతాయి. అసలే అమ్మ పుట్టెడు రోగంతో వుంది."

"బావుంది. నా మీద విరుచుకు పడతావెందుకు? కావాలంటే అత్తయ్య నడుగు వెళ్ళి."

"నే నెవ్వర్ని అడగను. కొంచెం ఉప్మా కాఫీ యిలా యివ్వు."

"నీ కేమైనా మతి వుండే మాట్లాడుతున్నావా? ఓమూల కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ కూర్చుందికదా......ఇప్పుడు ఉప్మాలూ, కాఫీలూ— ఆరగిస్తుందనుకున్నావేమిటి?"

తెల్లబోయింది విశాల—"అమ్మ కాఫీ తాగితే మొట్ట మొదట నువ్వే తప్పు పట్టేలావున్నావు. ఛీ! అమ్మ స్థితి తలుచు కొంటూంటే నీ కడుపు చెరువైపోవటం లేదూ? అసలే రోగిష్టి మనిషి. రాత్రిం బవళ్ళూ ఏడుస్తూ... ఏడుస్తూ... శవంలా తయారైంది. సాయంత్రం వరకూ నీరసంతో దడ దడ లాడుతూ వుంటుందా? కాఫీ తీసికెళ్తానంటే ఇంత రాద్ధాంతం చేస్తావా?"

"ఏమో బాబూ? ఇవన్నీ నాకు తెలియవు. పెద్ద వాళ్ళేవో చెప్పారు, నేనలాగే చేస్తాను. నా భయం నాది. మా అత్తగారికి తెలిస్తే ఛడామడా తిట్టిపోస్తుంది."

విశాల మరేమీ మాట్లాడలేదు. ఓ గ్లాసునిండా కాఫీ ఒంచుకుని వేడిగ్లాసు పైటకొంగుతో పట్టుకుని—వరండాలోంచి అమ్మ వున్న గదికేసి బయల్దేరింది.

సామాను గదిలో బియ్యంకొలిచి యిస్తోన్న సుంద రమ్మ గబగబా బైటికివస్తూ — "ఒసే విశాలా! ఎక్కడికే? అటుగాని వెళ్తున్నావా?" అంటూ గావు కేక పెట్టంది.

విశాల తిన్నగా కొట్టుగది ముందుకు వెళ్ళింది— తలు పుల మీద చెయ్యి వేసింది—. గుండె ఒక్కసారి ఆగినట్ట యింది. లోపల గడియపెట్టి వుంది.

"అమ్మా! ఒక్కసారి ...తలుపుతియ్యి."

సుందరమ్మ రుసరుసలాడుతూ వచ్చింది. గొంతుతగ్గించి కోపంగా అంది- "చాల్లేవే నీచోద్యాలూ—నువ్వూను. ఎవరైనా వింటే నవ్వి పోతారు. ఒక్కపూటకి తిండి లేక పోతే ఛస్తారా ఏమిటి? ఛస్తే పీడా పోయె- వెధవ అపనింద మోసే కంటే."

ఏమీవినిపించుకోలేదు విశాల. తలుపు మీద దబదబా బాదింది- "అమ్మా.ఒకసారి తియ్యవే!"

"ఒసే! నీకే చెప్తోంట. అంత పెంకితనం కూడదు. మళ్ళా స్నానం చేయించి దీపారాధన చేసేవరకూ దాని మొహం ఎవ్వరూ చూడకూడదు."

విశాలకు పుట్టెడు కోపం వచ్చింది- గిర్రున తలతిప్పి చూస్తూ అంది— "చూస్తే...?"

"చూస్తేనా?" విరుచుకు పడింది సుందరమ్మ.

"ఏమౌతుందో చెప్పనా?"

"అక్కర్లేదులే. నాకు తెలుసు. కీడు తగులుతుం దంటావు. అంతేనా?

"ఇదిగో విశాలా? నువ్వెన్ని చదువులు వెలగ బెట్టినా...కాస్తతప్పూ ఒప్పూ అన్నవి వుంటాయని గుర్తుంచుకో."

"తప్పు! మా అమ్మ మొహం నేను చూడటం తప్పా? అసలు అమ్మ ఏం తప్పు చేసిందని... యిలా వెలివేశారు మీరంతా?"

"తప్పు కాకపోతే పాపం చేసింది. తాతల నాటినుంచీ వస్తోందీ ఆచారం. ఇవ్వాళిటికి నువ్వు మహా గొప్పదానివై పోయావ్ అందర్నీ వెక్కిరించటానికి."

"అత్తయ్యా! నువ్వు పెద్దదానివి. అనవసరంగా నోరు చేసుకోకు. నేను గొప్పదాన్నై చేస్తోన్న వుద్ధరింపేమీ లేదు. మా అమ్మ పుట్టెడు అనారోగ్యంతో ఉంది. గుక్కెడు కాఫీ నీళ్ళు యిద్దామని తీసుకు వచ్చాను. ఈ మాత్రంలో మీ ఆచారాలకు జరిగే నష్టమేమీ లేదు."

ఐదారుగురు ఆడవాళ్ళక్కడచేరి చోద్యం చూస్తూ నించున్నారు. విశాలని వారించే ప్రయత్నం ఎవ్వరూ చెయ్యలేదు.

మళ్ళా తలుపులు తట్టుతూ పిల్చింది విశాల–"అమ్మా! ఒక్కసారి తలుపు తియ్యి. నేను నిన్నుచూడను లేవే! కాఫీ గ్లాసు ఈ వారగా పెట్టి వెళ్ళిపోతాను. అమ్మా!—తలుపు తియ్యి."

తలుపులు విడలేదు. వాటికేసి చాలామంది కళ్ళు కుతూహలంతో చూస్తూ వున్నాయి — విశాలకు గొంతు నిండా దుఃఖంవచ్చింది.

"అవును. ఈ తలుపులు తియ్యక పోవటం నీ పాతి వ్రత్యానికి నిదర్శనం అవుతుంది. ఈ ఆఖరి ఘడియల్లో అలాంటి నింద వేసుకోకమ్మా ! నేనే ఆలోచించలేక పోయాను."

గిర్రున వెనక్కి తిరిగి చరచరానడిచి వెళ్ళి పోయింది.

వంటల తతంగం ఓ కొలిక్కి వచ్చింది. చావిట్లో బ్రాహ్మణుల మంత్రాల తతంగం ప్రారంభమైంది. ఆడ—మొగా—చిన్నా పెద్దా అంతా అక్కడ చేరారు.

చచ్చిపోయిన నాన్న ఆత్మశాంతి కోసం పూజలు జరుగుతున్నాయి. గది కిటికీలో అంతా చూస్తూ కూర్చుంది విశాల.

"ఫలానా వ్యక్తి మరణించాడు. ఈ జగన్నాటకం నుంచి నిష్క్రమించాడు. ఈ వార్త అతని బంధువులకూ—స్నేహితులకూ—పరిచితులకూ—అపరిచితులకూ నిర్ధారణగా వెల్లడించ బడుతోంది. బ్రతికినంతకాలం ఆ వ్యక్తి మంచిగా బ్రతికాడు. జీవితం సార్థకం చేసుకున్నాడు. తన సంతానానికి మార్గ దర్శకుడయ్యాడు. ఆ వ్యక్తి అస్థిరత్వాన్ని ఈనాడు మనమంతా ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నాము."

ఆ సమావేశం తాలూకు అర్థం అదే! ఆ తతంగాల తాలూకు లక్ష్యం అదే! కానీ జరుగుతోన్న మంత్ర తంత్రాలూ, పూజా పునస్కారాలూ, చాలా అర్థరహితంగా—లక్ష్య విహీనంగా గోచరించాయి విశాలకు.

"అబ్బో! అదంతా ముగిసేసరికి మిట్ట మధ్యాన్నం అవుతుంది. పిల్లలకి బంతులు వేసెయ్యండి."

"నాకూ రెండు మెతుకులు పడెయ్యవే వుండలేను!"

"మళ్ళీ వచ్చి చూడవచ్చు. వెళ్ళి తిళ్లు తినండర్రా!"

ఇల్లంతా భోజనాల హడావుడితో గోలగోలగా వుంది.

విశాల లేచి వెళ్ళి మంచంమీద పడుకొంది.

పాత్రల దానం ప్రారంభమైంది. మంత్రాలు చదివీ కంఠాలశ్రుతి అధికమైంది. బ్రాహ్మలంతా వచ్చి పాత్రలు అందుకు వెళ్తున్నారు.

విశాల నిద్రలోకి జారిపోయింది.

* * *

కొట్టుగది తలుపులు ఎంతకీ రాకపోతే గునపాలతో విరగ్గొట్టాల్సి వచ్చింది. చిన్నా పెద్దా అంతా బిలబిల్లాడుతూ అక్కడ చేరారు.

లోపలికి తొంగి చూసిన చాకలి ఎంకి వెర్రికేక పెట్టింది.

"ఏవిటే? ఏవిటే? ఏమైంది?" అంటూ పేరంటా ళ్ళంతా కంగారుపడ్డారు. చావు కబురు చల్లగా బయట పడింది.

విశాల తల్లి కుప్పగా కూలిపోయింది. ఎక్కడి వాళ్ళ క్కడ నిశ్చేష్టు లయ్యారు. ఎవ్వరి నోటంటా మాటలేదు. వరలక్ష్మి గదిగుమ్మంలో కూలబడి ఘొల్లుమంది.

విశాల వరండా చివర స్తంభాన్ని ఆనుకుని నిలబడి పోయింది.

అమ్మకి దాహం వేసిందేమో! ఆ గదిలో పుడిసెడు నీళ్ళయినా లేవు. శోష వచ్చిందేమో! గంటల తరబడీ అతీ గతీలేదు.

బండెడు రోగం నుంచీ--పుట్టెడు దుఃఖంనుంచీ విముక్తి పొందింది అమ్మ.

నాన్న చచ్చిపోయారని విన్నప్పుడు కూడా విశాలకి ఎక్కువ దుఃఖం రాలేదు. అలాగే అమ్మచావు కబురు విన్నా కూడా అంతకన్నా ఎక్కువ బాధ కలగటం లేదు—అమ్మనీ నాన్ననీ తను నిజంగా ప్రేమించ లేదేమో?

"అమ్మా! నువ్వీ అవమాన భారంతో బ్రతకటం నా కిష్టంలేదు. ఈ సంకుచితపు అచారాలకు అతీతంగా వెళ్ళి పోయావు. నిన్ను ఇప్పుడు విధవని ఎవ్వరూ అనలేరు. నాన్న దగ్గర కలకాలం పుణ్య స్త్రీగా జీవిస్తూ వుండు."

విశాల కన్నీళ్ళు జలజలా రాలాయి.

ఎవరో తట్టి లేపుతోంటే త్రుళ్ళిపడి లేచింది.

"అదేమిటే? నిద్రలో ఏడుస్తున్నావా?" కంగారు పడింది వరలక్ష్మి. గబగబా కళ్ళు తుడుచుకొంది, విశాల. వరలక్ష్మి కేసి వెర్రిదానిలా చూసింది.

"అన్నం కూడా తినకుండా పడుకున్నావు. మూడు దాటి పోయింది."

"చావిట్లో తతంగం అంతా అయిపోయిందా?" నోరు విప్పింది విశాల.

"ఆఁ వీధి వాకిట్లో గోదానం యిస్తున్నారు. లేచిరా ఒక్కసారి! అమ్మని చూసి వెళ్ళి భోంచెయ్యి."

"అమ్మకి ఖులాసాగా వుందా అక్కయ్యా!"

"ఖులాసా ఏమిటి? కొనవూపిరితో కూర్చునివుంది."

"మళ్ళా స్నానం అయిందా?"

"అయింది."

"నువ్వు చూశావా?"

"చూశాను."

"ఎలా వుంది?"

"ఎలా వుంటుంది? దానిఖర్మ అలా కాలింది."

మాట్లాడలేదు విశాల--అంతరంగంలో ఎంతో ఆనందంగా వుంది. అమ్మ చచ్చిపోలేదు. బ్రతికేవుంది — ఏ రూపంలోవున్నా — ఏ పరిస్థితుల్లో వున్నా అమ్మ అమ్మే. అమ్మ చచ్చిపోతేనే తను సంతోషిస్తుందనుకోవటం ఒట్టిభ్రమ. అమ్మ బ్రతకాలనే తను కోరుకుంటోంది.

వరలక్ష్మి మళ్ళా అంది— "వెళ్ళి అమ్మని చూసిరా విశాలా! ఈ ముహూర్తంలో చూస్తే ఇక ఎప్పుడు చూసినా ఫర్వాలేదు."

"అమ్మని నేనిప్పుడు చూడలేనక్కయ్యా!" ఉదాసీనంగా అంది విశాల— "తెల్లటి సైనుగుడ్డ-- చేతుల కొంకోక్కొ రేకు

గాజు—బోసిమెడా—బోసి మొహం...ఒక్కొక్కళ్ళూ వెళ్ళి తనని చూస్తోంటే సిగ్గుతో చితికిపోదా అమ్మ?"

వరలక్ష్మికి కూడా దిగులు ముంచుకువచ్చింది.

"అమ్మ మునుపటిలా వుండదు. ఎంతో మారి పోతుంది." అన్న విషయాన్ని బాగా మనస్సుకి పట్టించుకుని "మారిపోయిన అమ్మనిచూసి తట్టుకోగల్గే శక్తి వచ్చాక అమ్మని చూస్తాను. ఇప్పుడు నాకాధైర్యం లేదు."

చెల్లెలి మాటలు వింటూ అయోమయంగా చూసింది వరలక్ష్మి.

"పోనీ గానీ చాకలి వచ్చింది. నీ బట్టలేమైనా వుంటే వెయ్యి." అనేసి వెళ్ళిపోయింది.

విశాల ఒక్క నిట్టూర్పు విడిచింది—ఇరవై సంవత్స రాలనుంచీ అమ్మని తను బాగాఎరుగును. రంగు రంగు చీరలు కట్టుకునే అమ్మ—అస్తస్త మానూ గాజులు తొడిగించుకునే అమ్మ — రూపాయి బిళ్ళంత బొట్టుపెట్టుకునే అమ్మ...

అమ్మ రూపమే మారిపోయి వుంటుంది.

అమ్మకూడా ఒకప్పుడు పుణ్యస్త్రీగా వుండేదన్న విషయం క్రమంగా అమ్మే మర్చిపోవచ్చు. జ్ఞాపకాల కెర టాల ప్రవాహంలో అందీ అందకండా కొట్టుకుపోతాయి. సర్వకాలాల్నీ—సర్వావస్థల్నీ భద్రపర్చుకునే శక్తి, మనిషి మస్తిష్కానికి లేదు.

"అమ్మకూడా పుణ్యస్త్రీయే" అన్న విషయాన్ని తను విస్మరించ కూడదు.

"ఎంకిని ఒక్కసారి యిలా రమ్మను అక్కయ్యా!" విశాల గుమ్మందగ్గిరకి వెళ్ళి నిలబడింది.

"ఎంకీ ! విశాలమ్మగారు పిలుస్తోందే ! ఎందుకో చూడు" అంటూ వాకిట్లోకి వెళ్ళి కేకపెట్టింది వరలక్ష్మి.

"ఏం అమ్మాయిగారూ?" అంటూ వచ్చింది ఎంకి. పండక్కి వచ్చినప్పుడు విశాల యిచ్చిన సిల్కు చీరే కట్టుకొంది ఎంకి—విశాలంటే ఎంకికి చాలా యిష్టం. ఎప్పుడేది అడిగినా యిస్తుంది విశాల.

"ఎంకీ! నీతో ఓపని వుందే!"

"చెప్పండమ్మాయిగారూ! మీ కోక లేవన్నా ఇస్త్రీ చేసి యివ్వాల్నా?"

"అది కాదే! మా అమ్మ తెల్లారుఝామున కట్టుకున్న ఎర్రచీర నీ దగ్గర వుందికదూ?"

కాస్త ఆశ్చర్యపడింది ఎంకి—"అది నేను తీసేసుకున్నానమ్మా! చెరువుకాడిగుడ్డ చాకల్దానికొస్తాది మీ కెరగ రేంటెి?"

"అవున్లే! నాకూ తెలుసు. కానీ ఆ చీర నాకు కావాలే ఎంకీ!"

వినకూడని మాట వింది ఎంకి. గుడ్లు పెద్దవిచేసి చూస్తూ నిలబడింది.

"ఎందుకంత ఆశ్చర్యం నీకు? నాకేం వూరికే యివ్వద్దులే. డబ్బిస్తాను. ఆ ఎర్రచీర యిస్త్రీచేసి తెచ్చిపెట్టు."

ఎంకి తెప్పరిల్లింది—"అదేంటం డమ్మాయిగారూ! కీడు గుడ్డ మీా ఇంట్లో ఎలా పెట్టుకుంటారు?"

"ఫర్వాలేదు. అలాటి నమ్మకాలేం లేవు నాకు. నా మాట విను."

"ఇదేటో నమ్మా! పెద్దోరికి తెలిస్తే నన్ను చీవాట్లెయ్యరా? ఉండండి; పెద్దమ్మగార్నడుగుతాను."

"ఒసే! ఎంకీ! ఎంకీ! మాట." విశాల పిలుస్తోన్నా విని పించుకోకుండా విసవిసా కొట్టుగదికేసి వెళ్ళిపోయింది ఎంకి.

* * *

రైలు పరిగెడుతోంది—విశాల కిటికీ దగ్గరేకూర్చుంది నిర్లిప్తంగా చూస్తూ. గంటలు గడిచాయి.

"అంత ముభావంగా వుండకు విశాలా! ఏమైనా మాట్లాడరాదూ?" అన్నాడు శేఖరం విశాల చేతిని మృదువుగా పట్టుకుని.

చూపు తిప్పింది విశాల—రెండు కన్నీటిబొట్లు రాలి పడ్డాయి.

"నా ఆలోచనలెందుకూ కొరగాకుండా పోయాయి. నే ననుకున్న దేమీా చెయ్యలేకపోయాను." అంది భారంగా.

"నీ విషయంవరకే నువ్వు ఆలోచించుకోవాలి. మిగతా వాళ్ళని శాసించలేవు కదా?"

"కనీసం నా విషయంలోకూడా నేను చేసుకోలేక పోయాను." నాకూ తండ్రి వుండేవాడు. ఆ తండ్రి నన్నెంతో ప్రేమించేవాడు. ఆయనదగ్గర వున్నప్పుడు అమ్మ ఎంతో అందంగా వుండేది. ఎన్నో అలంకరించుకునేది. అమ్మనీ— నాన్ననీ నేను బాగా ఎరుగుదును. వాళ్ళిద్దరి జ్ఞాపకాలకోసం ఓ చిహ్నం వుంచుకుందామను కున్నాను. అది సంపాదించటానికి నా శక్తి చాలలేదు.

నాన్న చచ్చిపోయాడు. అమ్మ విధవ అయింది. ఈ విషయమే నాకు గుర్తువుంటుంది—"దుఃఖంతో విశాల కంఠం నిండి పోయింది.

శేఖరం విశాల కళ్ళలోకి సానుభూతిగా చూశాడు.

"విశాలా! మీ నాన్నతోపాటే మీ అమ్మ చచ్చిపోవాల్సిన రోజులు మారాయి. మనిషి నిజంగా మనిషిలా బ్రతకటానికి ఇంకా చాలాకాలం పడుతుంది. నువ్వు కొంచెం కాలాన్ని అర్థం చేసుకొంటూ బ్రతకాలి."

విశాల కళ్ళల్లో కొంచెం సంతృప్తి మెరిసింది. శేఖరం తనని అర్థం చేసుకున్నాడన్న తృప్తి అది.

( '65 'కోమలి' నుంచి )